క్లుప్తంగా

మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం



గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో మూడురోజుల పాటు జరిగే మహాశివరాత్రి వేడుకలను బుధవారం ఎమ్మెల్యే మురళీనాయక్‌తోపాటు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, పూజారులు భానుశాస్త్రి, సతీష్‌పాండ్యే ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, పెసరి శివ, గాదె సాగర్, స్వామి పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలంలోని చిన్న నాగారం గ్రామంలో బుధవారం నిర్వహించిన ముత్యాలమ్మతల్లి బోనాల పండుగ ఉత్సవాలకు ఎమ్మెల్యే మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: మోడల్ క్రీడా పాఠశాల కొత్తగూడెంలో 2024–25 విద్యా సంవత్సరానికి 5నుంచి 10వ తరగతిలో ప్రవేశాల కోసం, హైదరాబాద్ బోయిపల్లి వాటర్ స్పోర్ట్స్ స్కూల్ 5వ తరగతిలో అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు ఎర్రయ్య బుధవారం తెలిపారు. గిరిజన విద్యార్థులు 9 నుంచి 11 సంవత్సరాలు ఉండాలన్నారు. ఈనెల 26నుంచి 28 వరకు ఉమ్మడి స్థాయి ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తారని, ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కొత్తగూడ క్రీడా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ 94404 13765, 94905 80404 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దు

డోర్నకల్/కురవి: ఫీజు బకాయిల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వకుండా ప్రైవేట్ పాఠశాలల యజమానులు పదో తరగతి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోత్ సూర్యప్రకాష్ కోరారు. స్థానిక మసీద్ సెంటర్‌లో బుధవారం జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో సూర్యప్రకాష్ మాట్లాడారు. సమావేశంలో బానోత్ సింహాద్రి, నర్సింహ, రాజేష్, సందీప్, జోగేంద్ర, రాకేష్ పాల్గొన్నారు.

విరాళం అందజేత



గార్ల: గార్లలోని సాయిబాబా మందిరంలో అన్నదాన కార్యక్రమానికి గార్లకు చెందిన పుల్లఖండం నరేష్ శ్వేత దంపతులు రూ.1,10,116 విరాళంను అర్చకుడు బోనగిరి సుదర్శన్‌రావుకు బుధవారం అందజేశారు.

తీర్మాన పత్రం..

దంతాలపల్లి: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేసి, అక్రమ కేసులు పెట్టిన బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని, గ్రామం నుంచి తీర్మానం చేశామని దాట్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్‌ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు తీర్మానపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొమ్మినేని సతీష్, నెమ్మది యాకయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుండాల ఐలయ్య, ఉపాధ్యక్షుడు మిడుతపల్లి వీరన్న, ప్రధాన కార్యదర్శి స్వర్గం సతీష్, నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్ స్థానం కేటాయించాలి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పార్లమెంటు స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు కేటాయించాలని ఎరుకల కుల సంఘం ఏకలవ్య వర్గం రాష్ట్ర నాయకులు రాయపురం సాంబయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద సోనియాగాంధీ చిత్రపటానికి బుధవారం రాయపురం సాంబయ్య మోకాళ్లపై కూర్చొని పాదాభివందనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి, అమీర్ పాషా, షరీఫ్, శ్రీకాంత్, సంపత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బంద్

దంతాలపల్లి: మండలం కేంద్రంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ పాపిరెడ్డి బుధవారం తెలిపారు. దంతాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిగల గ్రామాలు బొడ్లాడ, తూర్పుతండా, రామవరం, దంతాలపల్లి, పోలెపల్లి, మాటేడు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

● ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా ప్రజాసంక్షేమ పథకాలు అర్హులందరికీ ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండలంలోని తేజావత్‌రాంసింగ్‌తండాలో బుధవారం సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పాటిమీదిగూడెంలో అనాథలైన ఇద్దరు చిన్నారుల పరిస్థితిని తెలుసుకుని విద్యాభివృద్ధికి ఏర్పాట్లు చేయించారు. అనంతరం గాజులగట్టు, భూపతిపేట, సీతానగరంతో పాటు పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, బొల్లికొండ మధుగౌడ్, బీరం శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పార్టీ మండల యువజన నాయకుడు జర్పుల విజయ్‌నాయక్ అన్నారు. మండలంలోని బాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో జర్పులతండాలో ఉపాధి హామీ నిధుల నుంచి విడుదలైన రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మంగ్యా, శ్రీను, జితేందర్, లక్ష్మణ్, మహేష్, పాపులాల్, సోమ, కర్ణనాయక్, తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



మరిపెడ రూరల్: జర్పులతండాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో రూ.8లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు, గంగాధర్, శేషయ్య, రామయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



డోర్నకల్: ఉయ్యాలవాడలో..

మహిళా సదస్సును జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్/పెద్దవంగర/కురవి/డోర్నకల్: 'మహనీయుల విగ్రహాలు నిత్యస్ఫూర్తి చిహ్నాలు' అని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బలాస్టి రమేష్ అన్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. ఈనెల 10న జిల్లా కేంద్రంలోని చేపట్టనున్న సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ, మహిళా సదస్సును జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శశిధర్, ఉపాధ్యాయులు భూక్య బాలాజీ, యుగంధర్, రమేష్, అరుణ, హైమ, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న రమేష్

చదువులో రాణిస్తేనే గౌరవం



మాట్లాడుతున్న డేవిడ్

డోర్నకల్: విద్యలో రాణిస్తేనే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందని రాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ డేవిడ్ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో డాక్టర్ డేవిడ్ మాట్లాడుతూ.. విద్యలో రాణిస్తే సమాజంలో గౌరవంతోపాటు ముందడుగు వేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పరికపండ్ల అశోక్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాల నిర్దేశం, చదువుకునే పద్ధతులు, జ్ఞాపకశక్తి మెలకువలు, టెన్షన్‌ను అధికమించే మార్గాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ఎస్‌కె మున్నీ, ఆరోగ్య మిత్ర ప్రతినిధి సహజ, ఉపాధ్యాయులు అక్సా, శ్రీదేవి, స్వాతి పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

నెహ్రూసెంటర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ నాగమణి, ఆర్టీసీ డిపోమేనేజర్ ఎం.శివప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను డిపో ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందించి సన్మానించారు. అనంతరం మహిళా ఉద్యోగులకు ఆటలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ శ్యామ్, వెంకన్న, లక్ష్మయ్య, ఏఎంఎఫ్ పాపిరెడ్డి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మారుతున్న ఆధునిక సమాజంలో మహిళలు పురుషులతో పాటు సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని హెచ్ఎం బుర్ర రజిత అన్నారు. మండలంలోని పొనుగోడు అంగన్‌వాడీ సెంటర్‌లో గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు.

మహిళా దినోత్సవ ర్యాలీ

కొత్తగూడ: అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని సాధిరెడ్డిపల్లిలో సీడీఎస్ ఆధ్వర్యంలో ముందస్తు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అంగన్ వాడీ కార్యకర్తలు శోభ, సోమలక్ష్మి, ప్రేమలత, పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎస్ఎం వనిత పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: కేక్ కట్ చేస్తున్న మహిళలు

సన్మానం

మరిపెడ రూరల్: అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గాలివారిగూడెం పాఠశాలలో స్వీపర్‌గా విధులు నిర్వహించిన ఉపేంద్రమ్మను బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాములమ్మ అనిత, అచ్చమ్మ, ఉపాధ్యాయులు మురళీధర్, వెంకన్న, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నెహ్రూసెంటర్: ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఉద్యోగుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.కుమార్, ఎండి రుక్ముద్దీన్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని బుధవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నేడు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టామని, విజయవంతం చేయాలన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

గూడూరు: ఎండలు ఎక్కువవుతున్న దృష్ట్యా గ్రామాల్లో ఎప్పటికప్పుడు తాగునీటి సమస్య రాకుండా చూడాలని డీఆర్‌డీఓ పురుషోత్తం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తాగునీటి ఎద్దడిపై నివారణ, ఉపాధి హామీ పనులు, కొత్త ఓటర్ల నమోదుపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, తహసీల్దార్ శ్వేత, ఎంపీఓ చంద్రమోహన్ పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

నెల్లికుదురు: సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని సొసైటీ చైర్మన్ కాసం లక్ష్మిచంద్రశేకరరెడ్డి అన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. దీంతో బుధవారం మళ్లీ బాధ్యతలు చేపట్టిన లక్ష్మిచంద్రశేఖరరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మహబూబాబాద్ అర్బన్: బాలికలు, మహిళల భద్రతే పోలీసుల బాధ్యత అని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మ గూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థులకు బాల కార్మికుల, బాల్యా వివాహాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుపతిరావు హాజరై మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సోషల్ మీడియాలో గుర్తు తెలియని వారితో చాటింగ్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు దీపికరెడ్డి, రమేష్, బ్లూకోర్టు సిబ్బంది, సంపత్, విజయ్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ తిరుపతిరావు

కేసు నమోదు

గార్ల: ఇంట్లో భర్త లేని సమయంలో ఒంటరిగా ఉన్న మహిళపై దాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ బుధవారం తెలిపారు. గార్ల మండలం చిన్నకిష్టాపురం పంచాయతీ సర్వన్‌తండాకు చెందిన బానోత్ జగదీష్ అతిగా మద్యం తాగి రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన ఇంట్లో ఒంటరిగా ఉన్న బానోత్ దేవిపై దాడికి పాల్పడి గాయపర్చాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు జగదీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా మహేష్ యాదవ్

గార్ల: గార్ల మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా చెవుల మహేష్ యాదవ్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా గోళ్ల గణేష్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్, సంఘం జిల్లా కార్యదర్శి నసర్త బాబూరావు, పట్టణ కార్యదర్శి రవియాదవ్, రామయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'రైతు నేస్తం'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

నర్సింహులపేట: రైతుల సమస్యల పరిష్కారం కోసమే రైతు నేస్తంను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, ఏడీఏ శోభన్‌బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీను, సంజీవరెడ్డి, సామిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

'కేంద్ర' పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ అసెంబ్లీ ప్రభారి భాస్కర్‌రెడ్డి అన్నారు. నారీ శక్తి అభియాన్ కోఆర్డినేటర్ ఇందుభారతి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 'నారీ శక్తి వందన్' కార్యక్రమం నిర్వహించారు. వర్చువల్‌లో ప్రధాని మోదీ మహిళల సంక్షేమ పథకాలపై వివరించారు. ఈసందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు యలమంచిలీ వెంకటేశ్వర్లు, అసెంబ్లీ కన్వీనర్ కోమల్‌రెడ్డి, నారీ శక్తి పార్లమెంట్ కోఆర్డినేట్ సురేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాప సీతయ్య, జిల్లా కార్యదర్శి శ్రీను, ఉపాధ్యక్షులు సంపత్, ప్రధాన కార్యదర్శి మురళీ పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

మహిళా సంక్షేమానికి పెద్దపీట

దంతాలపల్లి: కేంద్రం ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని డోర్నకల్ నియోజకవర్గ ప్రభారీ బీరప్ప అన్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 'నారీ శక్తి వందన్' నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బాలగురు వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు లింగంనాయక్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు



మరిపెడ రూరల్: ముస్తాబైన అగస్త్యేశ్వరాలయం



గూడూరు: శివాలయంలోని పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారు కొండపై స్వయంబుగా వెలసిన అగస్తేశ్వర స్వామి ఎంతో మహిమాన్వితుడు. ఉమ్మడి జిల్లాలైన వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు సరిహద్దు ప్రాంతమైనందున ఈ ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువే. ఈనెల 8న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు జిల్లాల సరిహద్దు గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు.

గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయం మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతుంది. ఎక్కడ లేని విధంగా శివపార్వతుల విగ్రహాలు, శివలింగంతో కొలువై ఉన్న ఈ ఆలయం అరుదైన దేవాలయంగా పేరుగాంచింది. భక్తులు కోరిన కోర్కెలు.. మొక్కిన మొక్కులు తీర్చే ఇలవేల్పుగా వెలుగొందుతుంది. ఆలయ కమిటీ నిర్వాహకులు అనేక వేడుకలను, ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

కొత్తగూడ: మహాశివరాత్రి పర్వదినానికి కొత్తగూడ మండలం గుండం శివాలయం సిద్ధం అవుతోంది. కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయంలో ప్రతీ శివరాత్రికి ఆలయ కమిటీ సభ్యులు జాతర నిర్వహిస్తారు. ఈమేరకు శుక్రవారం జరిగే శివరాత్రికి జాతరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



కొత్తగూడ: గుండం శివాలయం

గార్ల: మండలంలోని రాజ్యాతండాలో గల కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబు చేసినట్లు ఆలయ అర్చకుడు డి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సాదాసీదాగా మండల సభ

కొత్తగూడ: మండల సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా జరిగింది. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల గురించి వివరించారు. గ్రామాల్లో ప్రజలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని, పని ప్రదేశంలో తగు వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో చేసిన పనులకు కూలీ డబ్బులు వచ్చేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, జెడ్పీటీసీ పుష్పలత, తహసీల్దార్ రమాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలకులు విఫలం

బయ్యారం: రాజ్యాంగబద్ధంగా మహిళలకు కల్పించిన హక్కులను కాపాడటంలో పాలకులు విఫలమవుతున్నారని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఊకే పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మండలంలోని గురిమెళ్లలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో గల జెడ్పీహైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కోట కనకయ్య, రాములు, కొమురయ్య, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతరకు మంత్రి సీతక్కకు ఆహ్వానం



కొత్తగూడ: ఈనెల 20వ తేదీ నుంచి జరిగే గుంజేడు ముసలమ్మ జాతరకు మంత్రి సీతక్కను బుధవారం ఆలయ పూజారులు ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పూజారులు వెంకటేశ్వర్లు, వెంకన్న, అనంతరావు, మండల అధ్యక్షుడు సారయ్య పాల్గొన్నారు.

అన్నదానం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి ఆర్యవైశ్య పేద వృద్ధురాలు వేముల అనసూర్యమ్మ ఇటీవల మృతిచెందగా ఆమె జ్ఞాపకార్థం సాయిబాబా గుడి రోడ్డులో బుధవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు, మండల అధ్యక్షుడు గిరిధర్ గుప్త, జంగాల సదాశివుడు పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవం

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రతి ఇంటి నుంచి నీళ్ల బిందెలతో బయలుదేరిన మహిళలంతా బొడ్రాయికి, గ్రామదేవతల వద్ద జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి, ఎల్లాగౌడ్, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక లూటీకి యత్నం

చిన్నగూడూరు: ఆకేరు వాగు నుంచి తరలించిన 25ఇసుక ట్రిప్పుల డంప్‌లను మండలంలోని ఉగ్గంపల్లి శివారులో స్థానిక పోలీసులు ఇటీవల సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంప్‌లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ట్రాక్టర్‌లో లూటికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎంపీటీసీ భర్త మృతి

గార్ల: గార్ల ఎంపీటీసీ పసుపులేటి సుజాత భర్త పసుపులేటి రామారావు(47) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఎంపీపీ బట్టు నాగరాజు, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, గుండా వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామారావు, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పనిదినాలు పెంచాలి

తొర్రూరు రూరల్: గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులు చేస్తున్న కూలీల పని దినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాయుడు యాకూబ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కంఠాయాపాలెం, గుర్తూరు గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనుల తీరును పరిశీలించారు.

మేరమ్మతల్లికి పూజలు

డోర్నకల్: మండలంలోని లింబ్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని లచ్యాతండా రాంసింగ్ బాబా(వేంకటేశ్వరస్వామి) ఆలయంలో బుధవారం మేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు మాన్‌సింగ్ బాబోజీ, లచ్చు బాబోజీ పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో బుధవారం ఓ వానరం విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. స్థానికుడైన బలుసుకూరి సంపత్ వానరానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నాడు.

మహిళల హక్కులను హరిస్తున్న బీజేపీ

కేసముద్రం: రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులను బీజేపీ ప్రభుత్వం హరిస్తుందని పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు శివారపు శారద విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 7న మహబూబాబాద్‌లో జరిగే అంతర్జాతీయ మహిళా పోరాట దినోత్సవ సభను జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో తుర్క రాధమ్మ, జాటోత్ మంజుల, తార, బోడ తార, సాంబలక్ష్మీ, నీల, రజిత పాల్గొన్నారు.

కళాశాలకు సిట్టింగ్ స్క్వాడ్

గార్ల: గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ బోర్డు నుంచి రాష్ట్ర స్క్వాడ్ వచ్చి 6గురు విద్యార్థులను డిబార్ చేయడంతో బుధవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి సిట్టింగ్ స్క్వాడ్‌ను పంపించారు. పరీక్షలకు సిట్టింగ్ స్క్వాడ్‌గా సత్యనారాయణ వ్యవహరించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ గోవిందరావు తెలిపారు.

కుటుంబానికి వృద్ధురాలి అప్పగింత

ఖమ్మంక్రైం: తప్పిపోయి వచ్చిన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన వృద్ధురాలు కరుణపాక వీరమ్మను ఖమ్మం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులు ఆమె బంధువులకు అప్పగించారు. ఖమ్మం కరుణగిరి ప్రాంతంలో సంచరిస్తుండగా ట్రాఫికింగ్ యూనిట్ సిబ్బంది నరసింహారావు గుర్తించి చేరదీశారు. ఆమె తన కుమార్తెను చూసేందుకు వస్తూ తప్పిపోయినట్లు గుర్తించి సీఐ బాలాజీనాయక్ ఆధ్వర్యాన బుధవారం బంధువులకు అప్పగించారు.

స్వయంపాలన దినోత్సవం



పెద్దవంగర: చిన్నవంగర ప్రాథమికోన్నత పాఠశాలలో..



తొర్రూరు రూరల్: గుర్తూరులో ఉపాధ్యాయులతో విద్యార్థులు

పెద్దవంగర /తొర్రూరు రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.